క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: శివరాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సాయిబాబానగర్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు సాయిబాబానగర్, ఆరాంఘర్ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందని మరమ్మతుల కారణంగా ఈ కోత విధిస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు

రాజేంద్రనగర్: విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కన్వీనింగ్ కమిటీ సభ్యురాలు పార్వతి అన్నారు. మేడే వారోత్సవాలను పురస్కరించుకుని 7వ రోజు కాటేదాన్‌లో ఆటాపాటా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల పిల్లలు, విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. గెలుపొందిన వారికి సోమవారం కాటేదాన్‌లో జరిగే బహిరంగ సభలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

'యువ సంఘర్షణ' సభను విజయవంతం చేయాలి

శంషాబాద్: యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్‌అన్నారు. సోమవారం నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో ప్రియాంకాగాంధీ పాల్గొనే 'యువ సంఘర్షణ' సభకు పార్టీ శ్రేణులు, నేతలు, కార్యకర్తలతో కలిసి పెద్ద సంఖ్యలో తరలివెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ సుపరిపాలన కోసం ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని అభిప్రాయపడ్డారు. పట్టణంలో చేపడుతున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో గోడపత్రికను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాశ్ ముదిరాజ్, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, పటాన్‌చెరు బీసీ నాయకుడు నీలం మధు హాజరవుతారన్నారు.

'హనుమాన్ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం'

గోల్కొండ: హనుమాన్ జయంత్యుత్సవాలను భారీగా నిర్వహిస్తామని జై భవానీ యువసేన ప్రతినిధి పి. నర్సింగ్‌రావు తెలిపారు. ఆదివారం షేక్‌పేట్ సీతానగర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్తలతో కలిసి హనుమాన్ జయంత్యుత్సవాల వివరాలను వెల్లడించారు. ఈనెల 14న ఆదివారం జరిగే హనుమాన్ జయంత్యుత్సవాలను శ్రీ సీతరామానంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈనెల 14న ఉదయం 4 గంటలకు మేలుకొలుపు కార్యక్రమంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. గణపతి పూజ అనంతరం ఉదయం 5 గంటలకు ఆంజనేయస్వామికి విశిష్ట అలంకరణ, 5.30 గంటలకు స్వామి వారికి 1108 తమలపాకులతో విశేష అర్చన, 6.20 గంటలకు ఏక హారతి, కుంభహారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆ తరువాత హనుమాన్ చాలీసా పారాయణం, మహా హారతి, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయి. ఉదయం 9.30 గంటలకు భజన, మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారికి మహానైవేద్యం, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం 5.15 గంటలకు నక్షత్ర హారతి, సామూహిక హారతి, 5.30 గంటలకు రామాలయం నుంచి స్వామి వారికి పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయి. ఈ మహోత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రియాంక సభకు భారీగా తరలి రావాలి

గోల్కొండ: నేడు జరగనున్న కాంగ్రెస భరోసా సభకు కార్వాన్ నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్తున్నామని కాంగ్రెస్ నాయకులు అహ్మద్ ఖాన్, ఎ.కృష్ణ అన్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే సభలో ప్రియాంకగాంధీ హాజరై యూత్ డిక్లరేషన్ ప్రకటిస్తారని వారు అన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం యువతకు న్యాయం చేయడం లేదని వారు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఇచ్చిన భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం రౌడీయిజంతో లాక్కుందన్నారు. యువత ఈ సభకు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

గోల్కొండ పోలీస్ స్టేషన్‌కు కొత్త సొబగులు

గోల్కొండ: గోల్కొండ పోలీస్‌స్టేషన్ కొత్త సొబగులను సంతరించుకుంటుంది. కొన్ని సంవత్సరాల క్రితం కొత్త భవనంలో ప్రారంభమైన ఈ పోలీస్‌స్టేషన్‌కు అప్పట్లో ప్రాంగణంలో టైల్స్ వేయలేదు. కాగా ఆదివారం నుంచి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో టైల్స్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ వారం నగర కొత్వాల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించనున్నారని తెలిసింది. ఈ కారణంగానే పోలీస్‌స్టేషన్‌కు కొత్త సొబగులతో తీర్చిదిద్దుతున్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి.

నత్తనడక పనులు.. ప్రమాదాల్లో ప్రయాణికులు

- పనులను సగంలోనే వదిలేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని సంబంధిత అధికారులు

నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే రోడ్డు అది. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రెండు కిలోమీటర్ల రోడ్డును రూ.15 కోట్లతో విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. కాగా పనులను ప్రారంభించి మూడేళ్లు దాటినా నత్తనడకన కొనసాగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


రోడ్డు పక్కన డ్రైన్ కాలువలో కూరుకుపోయిన కారు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట సర్కిల్ నుంచి గండిపేట సర్కిల్ వరకు రెండు కిలోమీటర్ల దూరం రోడ్డును విస్తరించేందుకు రోడ్లు, భవనాల శాఖ నుంచి రూ. 15 కోట్లను విడుదల చేసి పనులను చేపట్టారు. అవసరమైన మేరకు కాకుండా ఒక్కో చోట ఇష్టానుసారంగా రోడ్డు ఎత్తు పెంచటంతో పక్కనే ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు, బృందావన్ కాలనీలోని కొన్ని రోడ్లు మెయిన్ రోడ్డు కన్నా తక్కువ ఎత్తులోకి మారిపోయాయి. దీంతో వర్షం పడితే వరద నీరంతా మెయిన్ రోడ్డు ప్రవేశాల్లో నిలిచిపోయి ఆయా గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీల వాసుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు..

- వంతెన, సైడ్ డ్రైన్ పనులను ఎక్కడికక్కడ వదిలి వేయటం, వాటి వద్ద కనీసం ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయకపోవటంతో కొత్తగా వచ్చిన వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత వారంలో ఓ కారు, ఆదివారం మరో కారు రోడ్డు పక్కన రెయిలింగ్ లేకపోవటంతో పాటు డ్రైన్ కాలువకు పైకప్పు లేక కాలువలోకి కూరుకుపోతున్నాయి. ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు.
- రోడ్డు పనులు పూర్తి కాకపోవటంతో రోడ్డు పక్కన ఏర్పాటు చేయాల్సిన వీధిదీపాలు, రోడ్డులో అక్కడక్కడా ఏర్పాటు చేయాల్సిన స్పీడ్ బ్రేకర్లు లేకపోవటంతో ప్రమాదాలు పెరగటానికి కారణం అవుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


గత వారంలో..

బిల్లులు చెల్లించకపోవడంతోనే పనులు ఆలస్యం



ఇంజినీరింగ్ కళాశాలలు, అనేక పాఠశాలలు, గేటెడ్ కమ్యూనిటీలు, గండిపేటకు వచ్చే పర్యాటకులు, శంకర్‌పల్లి వైపు ప్రయాణీకులు రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు పనులు మూడేళ్లు గడిచినా.. పూర్తి కాకపోవటం దారుణం. ఇదే విషయాన్ని కాంట్రాక్టర్‌ను అడిగితే తాను చేసిన పనులకే ఇప్పటి వరకు బిల్లులు రాలేదని, అందుకే పనులను నిలిపివేశానని అంటున్నాడు. కనీసం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చొరవ తీసుకుని పనులను పూర్తి చేయించాలి.

– ఆర్. ఆదిత్యరెడ్డి, కౌన్సిలర్, కోకాపేట్

రేషన్‌షాపు ప్రారంభం


మణికొండలో రేషన్‌షాపును ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: ప్రభుత్వం తరపున వస్తున్న బియ్యాన్ని ప్రజలకు అనుకూల సమయంలో అందించాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఆయన మణికొండ మున్సిపాలిటీ కేంద్రం పాత గ్రామంలో ఉన్న రేషన్‌షాపును మర్రిచెట్టు కూడలికి మార్చి నూతన భవనాన్ని వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం తరపున అనేక వస్తువులు ప్రజలకు అందేవన్నారు. ప్రస్తుతం ఒక్క బియ్యం మాత్రమే ఇవ్వటం, బయట నిత్యావసర ధరలు పెరిగిపోవటంతో పేదలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. వారి పరిస్థితిని అర్థం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని సరుకులు, సబ్బులు, నూనెలు, చక్కెర లాంటి వస్తువులను అందించి ఆదుకోవాలన్నారు. మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు కిరణ్‌కుమార్, ముత్యాలు, డీలర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో విద్యారంగం కీలకమైంది


మాట్లాడుతున్న విద్యాభారతి దక్షిణ క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శారదామంలో నిర్వహిస్తున్న శిశు మందిర నూతన ఆచార్యుల ప్రశిక్షణ వర్గంలో విద్యా భారతీ దక్షిణ క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో విద్యారంగం కీలకమైందని విద్యతో పాటు సమాజ విలువలు, దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు లభించే విధంగా భవిష్యత్తు తరాన్ని నిర్మాణం చేయాలన్నారు.

- జీవన నైపుణ్యాలు, బోధనలో సృజనాత్మకత, జాతీయతా విలువలు, ఇతరుల కష్ట సుఖాల్లో భాగస్వామ్యం ఇలాంటి విషయాలను విద్యార్థులకు అలవాటు చేయాలన్నారు.
- శిశు మందిరాలలో బోధన చేసే ఆచార్యులకు బోధనతో పాటు సమగ్ర రీతిలో శిక్షణ ఇస్తూ.. వాటిని అభ్యాసం చేయడం జరుగుతుందన్నారు. విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమురి శ్రీనివాసరావు, ఆచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత


విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సంగీత

రాజేంద్రనగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమయాన్ని కేటాయిస్తూ.. అన్ని రంగాల్లో రాణించాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొంద్ర సంగీతాగౌరీశంకర్ అన్నారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో యువకులు, చిన్నారులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. అత్తాపూర్, పాండురంగానగర్, నందిముస్లాయిగూడ, హైదర్‌గూడ, లక్ష్మీనగర్ కాలనీ, సాయినగర్, శివానగర్ కాలనీ, కేశవనగర్ కాలనీ తదితర ప్రాంతాల వారికి ఈ క్రీడా సామగ్రిని అందించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. పోటీల్లో తమ ప్రతిభను కనబరచాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమయం కేటాయించాలన్నారు. బిట్యూరి సిద్ధేశ్వర్, మల్లేష్, వెంకట్‌రెడ్డి, విజయస్వామి, గణేష్, స్టార్ చిన్న, రాజుపైల్వాన్ తదితరులున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


పూజల్లో పాల్గొన్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: భగవతిగూడలోని భవానీ, శివ, సాయి, ఆంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా జరిగాయి. ఈనెల 4 నుంచి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు బ్రహ్మశ్రీ రేపల్ల రాజేష్‌శర్మ పంతులు ఆధ్వర్యంలో వేదపండితులు ఘనంగా నిర్వహిస్తున్నారు. తెల్లవారు జామున దేవాలయంలో దేవాలయ వ్యవస్థాపకులు, సంఘ సేవకులు దేవిరెడ్డి రాజగోపాలరెడ్డి ఆధ్వర్యంలో శివ, భవానీ, గణపతి, సుబ్రహ్మణ్య, నాగదేవత, నంది, ఆంజనేయ, ధ్వజస్తంభ, సాయిబాబా, నవగ్రహ, బలిపీఠ శిఖర దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

సీడీఎఫ్ నిధులు కేటాయింపు


నిధుల కేటాయింపు మంజూరు పత్రాన్ని స్థానికులకు అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవతో నిధుల కేటాయింపు జరిగింది. రూ.12 లక్షల సీడీఎఫ్ ఫండ్స్ ద్వారా నిధులను కేటాయించేందుకు ఎమ్మెల్యే అంగీకరించారు. ఈ మేరకు సీడీఎఫ్ నిధుల కేటాయింపునకు అంగీకార పత్రాన్ని ఆయన ఆదివారం స్థానికులకు అందించారు. ఈ మేరకు నిధుల మంజూరు పత్రాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపే పత్రాలను స్థానికులకు ఆయన అందించారు. గచ్చిబౌలి డివిజన్‌లో సమగ్ర సంతులిత అభివృద్ధిలో భాగంగా సీడీఎఫ్ ఫండ్స్ కేటాయించేందుకు ముందుకొచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, పాండు పాల్గొన్నారు.

రాయదుర్గం: రాయదుర్గంలోని కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్థు నిర్మాణానికి మోక్షం లభించింది.

మట్టి కుండలకు భలే గిరాకీ



గోల్కొండ: వేసవి కాలం కావడంతో మట్టి కుండలకు బాగా అమ్ముడవుతున్నాయి. మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో మట్టి కుండలను తెచ్చి అమ్ముతున్నారు. మరోవైపు గోల్కొండ, టోలిచౌకి తదితర ప్రాంతాల్లో చల్లటి నీటికి మారుపేరైన ఆదిలాబాద్ రంజన్‌లు బాగా అమ్ముడవుతున్నాయి. 10 నుంచి 15 లీటర్ల సామర్థ్యం గల ఆదిలాబాద్ రంజన్‌లు రూ.350 నుంచి 450 ఒక్కొక్కటి అమ్ముతున్నారు. కాగా 2 నుంచి 5 లీటర్ల నీటి కుండలకు మంచి డిమాండ్ ఉంది. కాగా మట్టి కుండల తయారీలో కూడా కుమ్మరులు గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ రకాలు, సైజులలో కుండలను తయారు చేసి అమ్ముతున్నారు. ఒక లీటర్ మట్టి బాటిల్, అరలీటర్ మట్టి బాటిల్ ప్రత్యేకంగా తయారు చేసి అమ్ముతున్నారు. అయితే పెయింట్ చేసిన మట్టి కుండలు కొనవద్దని మట్టి కుండల నిర్మాణం గురించి తెలిసిన వారు అంటున్నారు. కుండలకు పెయింట్ చేయడం వల్ల వాటిలోని నీరు చల్లగ కాదని, అంతేకాకుండా దాహం కూడా తీరదని పలువురు అంటున్నారు. పెయింట్ చేయని కుండలే కొనాలని వారు అంటున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గోల్కొండ: బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పథకాలను తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను పక్కదారి పట్టిస్తుందని బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి టీ అమర్ సింగ్ అన్నారు. ఆదివారం ఆయన సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా సబ్జిమండికి చెందిన తన్వీర్ అహ్మద్‌కు మంజూరైన రూ.30 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వ నిధులు వస్తున్నాయన్నారు. సామాన్య ప్రజలకే కాకుండా రైతులకు సైతం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, అయితే ఈ పథకాలన్నింటికీ పేర్లు మార్చి బీఆర్ఎస్ ప్రభుత్వం తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటుందన్నారు. బీజేపీ కార్వాన్ నియోజకవర్గం కన్వీనర్ ఆకుల గోవర్ధన్‌రావు, బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డిజ్వర్ సింగ్, మైనార్టీ మోర్చా నాయకుడు అహ్మద్ పాల్గొన్నారు.

మైత్రి కమిటీ సేవలు అభినందనీయం



గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సేవలు అభినందనీయమని సౌత్ వెస్ట్ డీసీపీ కిరణ్ కరే అన్నారు. రాందేవ్‌గూడకు చెందిన దయానంద్ ఆదివారం ఆయనను మెహిదీపట్నంలోని డీసీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట ఎస్. రాజు వస్తాద్, షాన్నవాజ ఖాన్, ఎం.ఎ.బేగ్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కంటే అవినీతే పెరిగింది

బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్‌యాదవ్


పార్టీలో చేరిన వారితో మారబోయిన రఘునాథ్‌యాదవ్

గచ్చిబౌలి: రాష్ట్రంలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగినా బీజేపీ విజయం సాధించడం ఖాయమని బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి మారబోయిన రఘునాథ్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కొండాపూర్ డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు సాగర్ అధ్యక్షతన రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు, పదాధికారులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, కమిటీ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కంటే అవినీతే పెరిగిపోయిందన్నారు.ప్రజలు డబుల్ ఇళ్లు రాక నిరాశ్రయులు కాగా, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ, మోర్చా నాయకులు సునీత, శ్రీదేవి, ఆత్మారామ్, కిషన్‌జీ, మన్నెంకొండ సాగర్, సంతోష్‌గుప్తా, సురేష్‌సాగర్, రాములుగౌడ్, అజయ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఐటీ.. ఆధ్యాత్మికతకు నిలయం

రాయదుర్గం: ఆధ్యాత్మికతకూ నిలయంగా మారాయి ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిసరాలు. శతాబ్దాల చరిత్ర కలిగిన దేవాలయాలు పరిఢవిల్లుతున్నాయి. శేరిలింగంపల్లి పరిధి గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గం, నానక్‌రాంగూడ, గచ్చిబౌలి, టెలికామ్‌నగర్, గోపన్‌పల్లి, గౌలిదొడ్డి వంటి ప్రాంతాలలోని ఆలయాలకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. 450 ఏళ్ళ నాటి రాయదుర్గం వెంకటేశ్వరస్వామి ఆలయం , నానక్‌రాంగూడ రంగనాథస్వామి, గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయం, నిజాంకాలంలో వెలిసిన మధురానగర్ ఎదురుగడ్డ మైసమ్మ ఆలయం ఉన్నాయి.అలాగే రాయదుర్గం హుస్సేన్‌షావలీ దర్గాకు కూడా 450 ఏళ్ళకు పైగా చరిత్ర ఉన్నట్లు గుర్తింపు పొందింది. కాగా రాయదుర్గం, నానక్‌రాంగూడ ఆలయాల్లో నిర్వహించే రథోత్సవానికి ప్రత్యేకత ఉంది. అలాగే పలు ప్రాంతాల్లో అధిక సంఖ్యలో దేవాలయాలను నిర్మించారు.

ఏటా వైభవంగా ఉత్సవాలు

- నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయంలో ఏటా వారం రోజులపాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.
- రాయదుర్గంలోని హుస్సేన్‌షావలీ దర్గా లో మూడు రోజులపాటు జరిగే ఉర్సుకు పలు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు.


నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయ ప్రధాన గోపురం


మధురానగర్‌లో ఎదురుగడ్డ మైసమ్మ


గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయం


రాయదుర్గంలోని హుస్సేన్ షావలీ దర్గా


వేంకటేశ్వరస్వామి ఆలయం

జోరుగా అక్రమ నీటి వ్యాపారం

- వన్ మోర్ నగర్‌లో ట్యాంకర్ల ద్వారా నీటి దందా
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


వన్ మోర్ నగర్‌లో నీటిని నింపుకుంటున్న ట్యాంకర్లు

గోల్కొండ: ప్రజల అభ్యంతరాలను పట్టించుకోకుండా కొందరు అక్రమ నీటి వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. గోల్కొండ సమీపంలోని వన్ మోర్ నగర్‌లో కొంత కాలంగా ట్యాంకర్లు నింపి నగరంతో శివారు ప్రాంతాలకు నీటిని అమ్ముకుంటున్నారు. యథేచ్ఛగా సాగుతున్న బోరు అక్రమ నీటి వ్యాపారంతో స్థానికంగా ఉన్న నీటి బోర్లు ఎండిపోతున్నాయి. అక్రమ నీటి వ్యాపారంపై తహసీల్దార్‌తో పాటు ఆర్డీఓ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా కూడా ఇదిగో చర్యలు.. అదిగో చర్యలంటూ దాటవేస్తున్నారే తప్పా.. అధికారులు అక్రమ నీటి దందాను అడ్డుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తీసి అమ్మేవారు కొత్త పంథాను అనుసరిస్తున్నారు. కొందరు స్థానికంగా జాగాను కొని అక్కడ కాంపౌండ్ వాల్ వేశారు. ఆ జాగాలో వేసిన బోరు నుంచి దర్జాగా నీటిని తోడుకుంటున్నారు. మరికొందరు స్థానికంగా ఖాళీ ప్లాట్లు, ఇళ్లను మార్టిగేజ్ చేసుకుని అక్కడ వాటిలో బోర్లు వేస్తున్నారు. కాగా వాల్టా చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్న వారిపై తాము ఎన్నో మార్పు అధికారులకు ఫిర్యాదులు చేసినా కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. మరోవైపు పగలురాత్రి రాకపోలు సాగించే నీటి ట్యాంకర్ల కారణంగా స్థానికంగా తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వారు అంటున్నారు. వన్ మోర్ నగర్‌లో ట్యాంకర్లు రాకపోకలు సాగించే వీధులన్నీ బురదమయంగా మారాయి.

అక్రమ నీటి వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలి..



అక్రమ నీటి వ్యాపారంపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాం. క్రమం తప్పకుండా మళ్లీ మళ్లీ అధికారులను కలుస్తున్నాం. అయినా కూడా ఇదిగో అదిగో అంటూ అధికారులు తిప్పించుకుంటున్నారు. ట్యాంకర్ల యజమానుల దౌర్జన్యాలు నానాటికి పెరిగిపోతున్నాయి. స్థానికంగా భూగర్భ జలాలు ఎండిపోతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించాలి.

– ఓంప్రకాశ్, స్థానికుడు